
సాక్షి
గుంటూరు

ఆదివారం । 21 । జూలై । 2024



కలెక్టర్ ప్రత్యేక పూజలు

బాపట్ల: పట్టణంలోని శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ జె.వెంకట మురళి శనివారం సందర్శించారు. స్వామికి పూజలు చేసి, ఆలయ చరిత్రను తెలుసుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు శాకంబరీ అలంకరణలో భ్రమరాంబ



పెదకాకాని: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, సుగంధ ద్రవ్యాలతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు దేవస్థాన ఉపకమిషనర్, కార్య నిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు శనివారం తెలిపారు. ముఖ మండపం, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం, సోమవారం భ్రమరాంబ అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకోవటం కోసం అవకాశం ఉందని ఉపకమిషనరు తెలిపారు. ఆదివారం భక్తులకు అమ్మవారి దివ్య ప్రసాదంగా కదంబ ప్రసాదం వితరణ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా పాఠశాలల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం గుంటూరు నగర పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను మలేరియా, డెంగీ తదితర అంటువ్యాధులపై అప్రమత్తం చేస్తూ విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలని పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. డీఈవో పి.శైలజ, జిల్లా ఎస్‌సీడీ ఇన్‌చార్జి శ్రావణ్‌బాబులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా మలేరియా నియంత్రణాధికారి సుబ్బారాయణం, డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రెంటచింతలలో భారీ చోరీ

రూ. లక్ష నగదు, 92 గ్రాముల బంగారం అపహరణ



రెంటచింతల:పల్నాడు జిల్లా రెంటచింతలలో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని జెండా చెట్టు సమీపంలోని ఏరువ ప్రతాప్‌రెడ్డి ఈ నెల 19 శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తెలంగాణ రాష్ట్రం హన్మకొండ పట్టణంలో వారి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 12.40 గం.ల సమయంలో ఇంటిపక్కన వారు తలుపులు తీసి ఉండటం గమనించి విషయాన్ని ప్రతాప్‌రెడ్డికి తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ప్రతాప్‌రెడ్డి ఇంట్లోని రెండు బీరువాలను పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించి వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనా స్థలానికి ఎస్ఐ ఎం.ఆంజనేయులు, ఏఎస్ఐ హనుమంతరావులు చేరుకుని ఆ ఇంటి చుట్టుపక్కల వారిని విచారించి, వివరాలు సేకరించారు. అనంతరం బ్రహ్మయ్య బావి సెంటర్‌లో ఏర్పాటుచేసిన పలు సీసీ కెమెరాలను పరిశీలించారు. రూ.లక్ష నగదు, సుమారు రూ.6.30 లక్షల విలువైన 92 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గుంటూరు నుంచి క్లూస్ టీంను పిలిపిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు బూరుగులమ్మ శాకంబరి ఉత్సవాలు

రేపల్లె రూరల్: ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో గల గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో శాకంబరి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకుడు భానుసుధాకర్ తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు కూరగాయలతో అలంకరించనున్నట్లు చెప్పారు. కూరగాయలు సమర్పించదలచిన భక్తులు ఉదయం ఆలయంలో అందించాలని కోరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

దేవదాయ శాఖ భూములపై టీడీపీ నేతల కన్ను

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పచ్చ నేతల దందా
- అక్రమంగా భూముల స్వాధీనం
- దేవదాయ శాఖ అధికారులే పావులు
- రైతులు, లీజుదారులను బెదిరించి వెళ్లగొడుతున్న వైనం
- మళ్లీ లీజు వేలంలో పాల్గొనకుండా అడ్డంకులు
- కుంటి సాకులతో రైతులను అనర్హులుగా ప్రకటిస్తున్న అధికారులు
- చివరకు టీడీపీ నేతలకే కట్టబెడుతున్న అధికారులు
- కొన్ని భూములను వేలం లేకుండానే సాగు చేస్తున్న టీడీపీ నేతలు


దేవుడి భూముల్లో పచ్చ నేతల పాగా



పెదకాకాని శివాలయం భూములకు వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు, చిత్రంలో రైతులు (ఫైల్)



లీజు కట్టిన తర్వాత కూడా లీజు కట్టలేదంటూ ఇచ్చిన నోటీసు



వంగిపురంలో రైతు కట్టిన లీజు రసీదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దేవుడి భూముల్లో పచ్చ ముఠాలు తిష్ట వేస్తున్నాయి. ఈ భూముల్లో సాగు చేసుకుంటున్నా రైతులు, లీజుదారులను వెళ్లగొట్టి హస్తగతం చేసుకుంటున్నారు. దేవదాయ శాఖ అధికారులనే పావులుగా ఉపయోగిస్తూ ఆలయాల భూములను చేజిక్కించుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత నెల రోజుల్లో పలు దేవాలయాల భూములను టీడీపీ నేతలు చేతుల్లోకి తీసుకున్నారు. మరికొన్నింటిని బలవంతంగా స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిచోట్ల లీజులను రద్దు చేయించి, వారి పేరున కొత్త లీజులు తీసుకుంటున్నారు. లీజు ప్రక్రియలో వేరే వారు రాకుండా అడ్డుకొంటున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న భూములకు కూడా లీజులు రద్దు చేసుకోవాలని అధికారులు హెచ్చరిస్తుండటంతో రైతులకు దిక్కుతోచడంలేదు. పొన్నూరు మండలం మునిపల్లిలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రెండెకరాలను గ్రామానికి చెందిన గోపిశెట్టి పున్నయ్య మూడేళ్ల లీజుకు తీసుకొని సాగు చేస్తున్నారు. 2023–24 కౌలు రూ.74 వేలు చెల్లించి దేవదాయ శాఖ అధికారుల నుంచి రసీదు పొందారు. ఈ భూమి లీజు రద్దు చేసుకోవాలని దేవదాయ శాఖ అధికారే పున్నయ్యకు చెప్పారు. అదేమంటే.. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చెప్పారని, వెంటనే లీజును రద్దు చేసుకోవాల్సిందేనని కరాఖండిగా చెప్పారు. దీంతో పున్నయ్య ఆందోళనలో పడ్డారు. మరో నాలుగున్నర ఎకరాలకు ఎలాంటి ప్రచారం, ప్రకటనలు లేకుండానే టీడీపీ నేతల అనుయాయులకు లీజుకు ఇచ్చినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలను ఆ శాఖ అధికారులు బయటకు చెప్పడం లేదు.

పచ్చలతాడిపర్రులో వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 30 ఎకరాలను వివిధ వర్గాల వ్యక్తులు మూడేళ్ల లీజుకి తీసుకొని సాగు చేసుకుంటున్నారు. ఇటీవల టీడీపీ నాయకులు ఆ పొలాల్లోకి అక్రమంగా వచ్చేసి లీజుదారులను భయభ్రాంతులకు గురిచేశారు. వెంటనే లీజు రద్దు చేసుకోవాలని హెచ్చరించారు. చేసేదేమీ లేక లీజుదారులు ఆ పొలాలను వదులుకున్నారు. అదే గ్రామంలో శ్రీ సాక్షి భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన 65 ఎకరాలను టీడీపీ వారే ఐదేళ్లుగా లీజుకు తీసుకొని సాగుచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో వీరికి ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదు. టీడీపీ నేతలు మాత్రం ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు సాగు చేసుకుంటున్న భూముల లీజులనే రద్దుచేసి, వాటిని కూడా వారే తీసుకుంటున్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూములకు గత ఏడాది దేవదాయ శాఖ అధికారులు మూడేళ్ల కాల పరిమితితో బహిరంగ వేలం నిర్వహించారు. అదే గ్రామానికి పుష్పాళ్ల వినోద్‌కుమార్ 5 ఎకరాలు (ఏడాదికి రూ. 77,600), పుష్పాళ్ల దీప్తి 1.25 ఎకరాలు (రూ. 12,500), సిద్ధంశెట్టి రత్తయ్య 5 ఎకరాలు (రూ.78,200) చొప్పున హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. మొదటి సంవత్సరం కౌలును గత నెల జూన్ 22న చెల్లించారు. వీరంతా వైఎస్సార్ సీపీ నాయకులు, మద్దతుదారులన్న కారణంతో స్థానిక టీడీపీ నాయకులు, నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య నేత ప్రోద్బలంతో గత నెల 26న అధికారులు నోటీసులిచ్చారు. గత ఏడాది బకాయి చెల్లించలేదని, దానితోపాటు ఈ ఏడాదికి ముందస్తు కౌలు కూడా చెల్లించి పొలంలోకి దిగాలని, లేదంటే భూములకు వేలం నిర్వహిస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. గ్రామంలో గత యాభై, అరవై ఏళ్లుగా పంట చేతికి వచ్చిన తరువాతే కౌలు చెల్లిస్తున్నారని, తాము కూడా అలానే చెల్లిస్తామని పాటదారులు అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో ముందస్తు కౌలును కూడా అప్పులు చేసి ముందస్తు కౌలు చెల్లించాల్సి వచ్చింది.

- పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి 17 ఎకరాల 95 సెంట్ల పొలం చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం పరిధిలో ఉంది. పెదకాకాని మండలం దేవరాయబొట్లవారిపాలెంలో అర ఎకరం (50 సెంట్లు) ఉంది. ఈ భూములకు మూడేళ్ల కౌలుకు ఇటీవల బహిరంగ వేలం జరిగింది. గతం నుంచి వీటిని సాగు చేసుకుంటున్నవారు వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చారు. అయితే, వారు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కావడంతో కుంటి సాకులతో వారిని వేలానికి అనర్హులుగా ప్రకటించారు. ఆస్తి విలువ ధృవీకరణ పత్రం లేదని, ప్రతి ఏటా మార్చి 31వ తేదీ దాటిన తరువాత కౌలు చెల్లించారనే కారణాలతో అనర్హులుగా ప్రకటించారు. గతంలో ఎటువంటి ధృవీకరణ పత్రాలు అడగలేదని, డిపాజిట్ కట్టి పాల్గొంటామని చెప్పినా బ్యాంకు డీడీ కావాలంటూ సాకు చెప్పి పాటలో పాల్గొనకుండా చేశారు. ఇప్పుడీ భూములను తెలుగుదేశం పార్టీకి చెందిన వారు దక్కించుకున్నారు.
- చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం అప్పాపురంలో అంకమ్మ తల్లి దేవస్థానానికి సర్వే నెంబర్ 1423లో 9.54 ఎకరాల సాగు భూమి ఉంది. గతంలో వేలం పాట పెట్టడానికి పిలిచి వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ పాట పిలవకుండానే తెలుగుదేశం పార్టీ నాయకులు నెల్లూరి హరిబాబు, యామిని వెంకటేశ్వరరావు, యామిని శ్రీనివాసరావు, యామిని సుబ్బారావు తలా కొంచెం పంచుకుని సాగు మొదలు పెట్టారు.

పథకం ప్రకారమే వేలం పాటల్లో పాల్గొనకుండా చేశారు



పెదకాకాని శివాలయం భూములు ఏళ్ల తరబడి పాటలో పాడుకుని సాగు చేసుకుంటున్నాం. ఇప్పుడు టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు కుమ్మక్కై పథకం ప్రకారం కొత్త కొత్త షరతులు పెట్టి వేలంలో పాల్గొనకుండా అడ్డుకున్నారు. ఉప్పలపాడు శివాలయంలో నిర్వహించాల్సిన వేలం పాటలు పాత గుంటూరు శివాలయంలో నిర్వహిస్తున్నారు. శ్రీ అగస్త్యేశ్వరస్వామి భూములు 6.75 ఎకరాలకు రహస్యంగా వేలం పెట్టిన విషయం తెలుసుకుని 20 మంది రైతులం అక్కడకు వెళ్లాం. అయినా రైతులు రాలేదంటూ వేలం నిలిపివేశారు. వేలం విషయం నోటీసు బోర్డులో పెట్టడంలేదు, గ్రామంలో దండోరా వేయించడంలేదు. ఎవరికీ తెలియకుండా వేలం పాటలు నిర్వహిస్తున్నారు. ఇది ముమ్మాటికీ మోసమే.

– అమ్మిశెట్టి మల్లికార్జునరావు, రైతు, వెంకటకృష్ణాపురం

రాజకీయ కక్ష సాధింపులు



దేవదాయశాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఐదు ఎకరాలు మూడేళ్లకు పాటలో దక్కించుకున్నాను. తొలి ఏడాదికి కౌలు చెల్లించాను. అయినా కౌలు చెల్లించలేదని నోటీసు ఇచ్చారు. రెండో ఏడాదికి కూడా ముందుగా చెల్లించాలన్నారు. లేదంటే మళ్లీ వేలం పాట పెడతామన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా ఉండటం వల్లే ఇలా నాపై టీడీపీ నేతల ప్రోద్బలంతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. గ్రామంలో ఎవ్వరికీ లేని నిబంధన నాకొక్కడికే వర్తిస్తుందా?

– పుష్పాళ్ల వినోద్ కుమార్ (వంగిపురం)

ఎడతెరిపి లేని వర్షం

- స్తంభించిన జన జీవనం
- జిల్లాలో సగటు వర్షపాతం 23.7 మి.మీ
- 3,014 హెక్టార్లలో నీట మునిగిన వరి సాగు



తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద కోటేళ్లవాగు పొంగడంతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీటితో పంట కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. 3,014 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట నీట మునిగింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 427.4 మి.మీ వర్షపాతం కురవగా సగటు వర్షపాతం 23.7 మి.మీ నమోదైంది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లిపర, తెనాలి, తాడేపల్లి, పెదకాకాని, వట్టిచెరుకూరు, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల పరిధిలోని 40 గ్రామాల్లోని 3,155 మంది రైతులకు చెందిన వెద పద్ధతిలో సాగు చేసిన 3,014 హెక్టార్లలోని వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 47.6 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 9.8 మి.మీ వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి 41.6, తాడికొండ 41.2, దుగ్గిరాల 38.6, తుళ్లూరు 38.2, తెనాలి 26.4, కొల్లిపర 25.2, చేబ్రోలు 24.6, పెదకాకాని 21.2, గుంటూరు తూర్పు 18.4, గుంటూరు పశ్చిమ 17.8, ప్రత్తిపాడు 15.8, మేడికొండూరు 14.4,



చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం వద్ద నీట మునిగిన వెద సాగు

వట్టిచెరుకూరు 12.8, ఫిరంగిపురం 12.4, పెదనందిపాడు 11.2, కాకుమాను మండలంలో 10.2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై మాసం 20వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 106.4 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 183.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు.

దుర్గాదేవి గుడిలోకి వర్షం నీరు



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలోకి చేరిన వర్షపునీరు

దాచేపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. శనివారం కురిసిన వర్షం ధాటికి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పల్నాడు జిల్లా నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలోకి వర్షపునీరు చేరింది. ఆలయం సమీపంలోని మురికికాలువలు వ్యర్థాలతో నిండి ఉండటంతో నీరంతా ఆలయంలోకి వచ్చాయి. వర్షంతో రోడ్లన్ని చిత్తడిగా మారాయి.

జాయింట్ కలెక్టర్‌గా భార్గవ్ తేజ



భార్గవ్ తేజ



దినేష్ కుమార్

గుంటూరు వెస్ట్ :గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అమిలినేని భార్గవ్‌తేజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఇప్పటి వరకు కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. గతంలో గుంటూరు జేసీగా పనిచేసిన రాజకుమారి నంద్యాల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి విదితమే. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భార్గవ్ తేజ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా దినేష్‌కుమార్

నెహ్రూనగర్: గుంటూరు నగర కమిషనర్‌గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కొత్తమాసు దినేష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం 62 మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. రాజమహేంద్రవరం (రాజమండ్రి) మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న కీర్తి చేకూరిని ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలకు ఆదేశం

- నిబంధనలకు విరుద్ధంగా ఓసీ కోసం సిఫార్సు చేసిన అధికారులు
- క్షేత్రస్థాయి పర్యటనలో లోపాలు గుర్తించిన కమిషనర్
- టీపీఎస్, ప్లానింగ్ సెక్రటరీలకు ఛార్జెస్ ఫ్రేం చేయాలని ఆదేశం




బిల్డింగ్ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం సిఫార్సు చేసిన టీపీఎస్, సంబంధిత వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు చార్జెస్ ఫ్రేం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. బృందావన్ గార్డెన్స్ 7వ లైన్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని కమిషనర్ శనివారం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఫైల్ పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను పలుమార్లు ఆదేశించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బృందావన్ గార్డెన్స్ 7వ లైన్‌లో ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనం నిర్దేశిత నిబంధనలకు 18 శాతం అతిక్రమించి నిర్మాణం జరిగిందని, అటువంటి భవనానికి ఓసీ కోసం తమకు ఫైల్ పంపిన సంబంధిత టీపీఎస్ రిజ్వానా, 117 వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి తనూజలకు చార్జెస్ ఫ్రేం చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్‌కి భిన్నంగా, రెసిడెన్షియల్‌కు అనుమతి తీసుకొని కమర్షియల్‌గా వినియోగిస్తున్న పలు భవనాలపై ఫిర్యాదులు అందాయని, నిబంధనలు అతిక్రమించిన భవనాలకు నామమాత్రపు నోటీసులు ఇచ్చిన అధికారులపై కూడా ఫిర్యాదులు అందాయన్నారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలను ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి పాల్గొన్నారు.

మేయర్ చెప్పినా పట్టించుకోరా?

కార్పొరేషన్ అధికారుల తీరుపై గుంటూరు మేయర్ కావటి ఆగ్రహం



నెహ్రూనగర్: మేయర్ స్వయంగా చెప్పినా కార్పొరేషన్ సమావేశానికి ఏర్పాట్లు చేయరా? అంటూ గుంటూరు కార్పొరేషన్ అధికారులపై మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ చరిత్రలో జూలై 20వ తేదీ బ్లాక్ డేగా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు సహకరించని అధికారుల తీరును తప్పుబడుతూ ఆయన నల్లచొక్కా ధరించి నిరసన తెలిపారు. కావటి మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ నెల 20న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈ నెల 8వ తేదీన మీడియా సమావేశంలో ప్రకటించా. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించా. మున్సిపల్ యాక్ట్ ప్రకారం కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్ నిర్ణయిస్తే.. అధికారులు వెంటనే కౌన్సిల్ సభ్యులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపీలకు సమాచారం పంపించాల్సిందే. కానీ గుంటూరు కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి.. సభ్యులకు సమాచారం పంపించలేదు. ఫిబ్రవరి 11న చివరి సారిగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాం. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. నిబంధనల ప్రకారం వారు ఎక్కడ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉంటారో మేయర్ చాంబర్ నుంచి కన్సర్న్ లెటర్స్ అడిగాం. వారు కూడా తమ నిర్ణయాన్ని తెలియజేస్తూ లేఖలు పంపించారు. శనివారం సమావేశం జరిగి పాల్గొంటే.. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతాయని భావించా. నగరాభివృద్ధికి నూతన ప్రజాప్రతినిధులతో కలిసి ముందుకెళ్తామని గతంలోనే చెప్పామని.. దానికి అనుగుణంగానే నేడు సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించా. కానీ వారు కనీస చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా. న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటాం' అని చెప్పారు.



శాకంబరీదేవి.. శరణు శరణు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా జరిగాయి. ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులకు సైతం కూరగాయలతో అలంకరించారు. కూరగాయలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు బారులు తీరి కనిపించారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

క్లుప్తంగా

కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: కిడ్నీ రాకెట్ కేసులో ఏ–2గా ఉన్న నిందితుడి నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. మధుబాబు కిడ్నీని మధ్యవర్తుల ద్వారా రూ.30 లక్షలకు విక్రయించాడు. మధ్యవర్తులు కేవలం రూ.లక్ష రెండు విడతలుగా చెల్లించి, మిగిలిన డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు. ఈ కేసులో ఇటీవల పోలీసులు ఇరువురు నిందితులను అరెస్టు చేశారు. శనివారం విజయవాడలోని గన్నవరం వీఎన్‌కాలనీకి చెందిన ఎస్.వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. వెంకటేశ్వరరావు డోనర్‌కు, రిసీవర్‌కు మధ్యవర్తిత్వం చేశాడు. కిడ్నీ మార్పిడికి సంబంధించి పత్రాలు సృష్టించాడు. కేవలం కమీషన్ కోసం కిడ్నీ మార్పిడిని ప్రోత్సహించాడు. వెంకటేశ్వరరావు కిడ్నీ రిసీవర్ నుంచి రూ. 2 లక్షలు కమీషన్ అందుకున్నాడు. వెంకటేశ్వరరావు ఏ–1 అయిన బాషా కిడ్నీ మార్పిడి సమయంలోనూ సహకరించాడని పోలీసులు నిర్ధారించారు. వెంకటేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పార్శిల్ లారీ డ్రైవర్ మృతి

మృతుడు గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు వాసిగా గుర్తింపు



యడ్లపాడు: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుకగా మరో వాహనం ఢీకొనడంతో పార్శిల్ లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పెదపలకలూరు గ్రామానికి చెందిన పగిడిపల్లి నవీన్(23) ఓ పార్శిల్ కంపెనీకు చెందిన లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా పామర్రు ప్రాంతంలో పార్శిల్ లోడును దించి తిరిగి గుంటూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో స్థానిక ఎర్రకొండ సమీపంలో 16 నంబర్ హైవే వంతెన వద్ద గుంటూరు వైపు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి పార్శిల్ లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితికి వెళ్లిన డ్రైవర్ నవీన్‌ను హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నవీన్ తల్లి మల్లేశ్వరి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ జె.శామ్యూల్ రాజీవ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కడప - విశాఖ మ్యాచ్ డ్రా

తొలి ఇన్నింగ్ ఆధిక్యంతో విశాఖకు 3 పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా వైఎస్సార్ కడప, విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. వర్షాలతో మూడు రోజుల పాటు కొనసాగాల్సిన మ్యాచ్ తొలి రోజుకే పరిమితమయింది. తొలిరోజు కడప జట్టు 52 పరుగులకే కుప్పకూలగా, విశాఖ జట్టు 4 వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 96 పరుగులు సాధించిన విశాఖ జట్టుకు 3 పాయింట్లు, కడప జట్టుకు ఒక పాయింట్ లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు పర్యవేక్షించారు.

బ్రెయిన్ సమస్యలు బాగా పెరుగుతున్నాయి

- స్ట్రోక్‌లను ముందస్తుగా గుర్తించి నివారించవచ్చు
- స్ట్రోక్ బాధితులకు ఆధునిక చికిత్సలు
- ఏపీ న్యూరో కాన్ రాష్ట్ర సదస్సులో పలువురు వైద్యుల వెల్లడి



సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పక్కన డాక్టర్ విజయ, డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ సుందరాచారి తదితరులు

గుంటూరు మెడికల్: ప్రతి ఏడాదీ బ్రెయిన్ సంబంధిత సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ 31వ వార్షిక రాష్ట్ర సదస్సు గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో ఏపీ న్యూరోకాన్ –2024 పేరుతో శుక్రవారం ప్రారంభమైంది. శనివారం సదస్సును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాంగ్జైటీ, డిప్రెషన్లు బాగా పెరిగిపోవడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. న్యూరో సైన్స్ చాలా అభివృద్ధి చెందిందని, ఎన్నో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. సైన్స్‌కు తోడుగా యోగా జత చేయడం ద్వారా వ్యాధులను చాలా వరకు కట్టడి చేయవచ్చని వెల్లడించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌కు ఒకప్పుడు చికిత్సలు అంతగా అందుబాటులో ఉండేవి కావన్నారు. నేడు అత్యాధునిక వైద్య సేవలు పక్షవాత రోగులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. వ్యాధి నిర్ధారణ పద్ధతులు కూడా నేడు అందుబాటులోకి రావడం వల్ల ముందస్తుగానే బ్రెయిన్ స్ట్రోక్‌ను గుర్తించి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. స్ట్రోక్ బాధితులకు రోబోటిక్ అసిస్టెంట్స్ రిహాబిలిటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా పక్షవాత రోగులు త్వరితగతిన కోలుకుంటారన్నారు. న్యూరో రేడియాలజీ, రిహాబిలిటేషన్ వల్ల స్ట్రోక్ బాధితులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని చెప్పారు. నేడు పెద్దవారితోపాటు చిన్నారుల్లో కూడా మైగ్రేన్ తలనొప్పి సర్వసాధారణంగా కనిపిస్తుందని, దీనిని తగ్గించేందుకు నేడు కొత్త మందులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. తలనొప్పి ఉందని బాధపడకుండా న్యూరాలజిస్టులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. మైగ్రేన్ తలనొప్పి ఎక్కువగా వంశపారంపర్యంగా వస్తుందన్నారు. ఒత్తిడి, ఆందోళన వల్ల ఇది వస్తుందని పేర్కొన్నారు. బీపీ, షుగర్ లాంటి రిస్క్ ఫ్యాక్టర్లను తగ్గించుకోవడం ద్వారా డిమెన్షియా, అల్జీమర్స్ లాంటి బ్రెయిన్‌కు వచ్చే జబ్బులు రాకుండా నివారించవచ్చు అన్నారు. ఫిట్స్ నేడు పిల్లల్లో కూడా ఎక్కువగా వస్తున్నాయని, ఫిట్స్ నిర్ధారణకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు, మందులు వచ్చాయన్నారు. కొన్ని రకాల మూర్ఛ వ్యాధులను మందులతో పనిలేకుండా ఆపరేషన్లు చేసి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. బ్రెయిన్ సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ సరిపడ నిద్రపోవాలని, నిర్దీత వేళకు భోజనం చేయాలని చెప్పారు. ప్రతిరోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, మందు, సిగరేట్ లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రాగులు, సజ్జలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని, ఎక్కువగా కొవ్వు ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలని, మితంగా భోజనం చేయాలని సూచించారు. పిల్లల్లో సెల్‌ఫోన్‌ల వల్ల బ్రెయిన్ సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్లలోపు పిల్లలు సెల్‌ఫోన్లు చూడడం ద్వారా ఆటిజం, ఏడీహెచ్‌డీ, యాక్టీవ్‌గా లేకపోవడం లాంటి బ్రెయిన్ సమస్యలు వస్తున్నాయన్నారు. పిల్లల మెదడుపై చెడు ప్రభావం చూపిస్తున్న సెల్‌ఫోన్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలని సూచించారు. ముంబయికి చెందిన డాక్టర్ నిర్మలా సూర్య అడ్వాన్సెస్ ఇన్ మోటార్ రీహాబిలిటేషన్ గురించి, బెంగుళూరుకు చెందిన డాక్టర్ శ్రీనివాసన్ స్పైనల్ కార్డ్ రీహాబిలిటేషన్ గురించి, చండీఘర్‌కు చెందిన డాక్టర్ వివేక్‌లాల్ న్యూరో ఆప్తమాలజీ ఎమర్జెన్సీస్ గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, న్యూరో కాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.రామ్‌తారకనాథ్, డాక్టర్ చక్కా శివరామకృష్ణ, ఇండియన్ అకాడమి ఆఫ్ న్యూరాలజీ ప్రెసిడెంట్ డాక్టర్ దేబాషిస్ చౌదరి, డాక్టర్ మానస్ కుమార్, సుమారు 600 మందికి పైగా న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు పాల్గొన్నారు.

డాక్టర్ మూర్తికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



డాక్టర్ మురళీకృష్ణమూర్తి దంపతులను సన్మానిస్తున్న న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు

ప్రముఖ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జాగర్లమూడి మురళీకృష్ణమూర్తికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. గుంటూరులో శుక్రవారం నుంచి జరుగుతున్న ఏపీ న్యూరోకాన్–2024 రాష్ట్ర సదస్సులో శనివారం న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్య విభాగాల్లో అత్యంత ప్రభావిత వ్యక్తులుగా పేరు గడించిన వారికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇంజేటి బాబ్జిశ్యామ్‌కుమార్, న్యూరో కాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.రామ్‌తారకనాథ్, డాక్టర్ చక్కా శివరామకృష్ణ, ఇండియన్ అకాడమి ఆఫ్ న్యూరాలజీ ప్రెసిడెంట్ డాక్టర్ దేబాషిస్ చౌదరి, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నిర్మల్ సూర్య, డాక్టర్ మానస్‌కుమార్ తదితరులకు అవార్డులు అందజేశారు. డాక్టర్ మురళీకృష్ణమూర్తి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా పత్రాలు సమర్పించి అవార్డులు అందుకున్నారు. ఆయన పలు న్యూరాలజీ పత్రికలకు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. మూర్ఛ వ్యాధిపై పలు కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు, వైద్యులకు అవగాహన కల్పించారు. అమెరికా లాంటి దేశాలు సైతం డాక్టర్ మురళీకృష్ణమూర్తికి పలు అవార్డులు అందించాయి. ఎంతో మంది న్యూరాలజిస్టులు ఆయన శిష్యరికంలో చేరి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పత్తి పొలాలను పరిశీలించిన పల్నాడు డీఏఓ మురళి



ఎర్రబాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ఐ.మురళి శనివారం ఏఓ వేణుగోపాల్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక పత్తి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందుకు పత్తిపైరులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పత్తిపంట ప్రస్తుతం 30–40 రోజుల దశల్లో ఉన్నట్లు తెలిపారు. వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతో పంట పొలాల్లో నీళ్ల నిలబడే అవకాశాలున్నాయని, వాటిని చిన్న చిన్న కాలువలు చేసి బయటకు పంపించేయాలని సూచించారు. పైరు ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఎరువులను బూస్టర్ డోస్‌గా వినియోగించుకోవాలన్నారు. వాతావరణంలో అధిక తేమశాతం ఉన్నందున తెగుళ్ల ఉధృతి ఉంటుందని, వాటి నివారణకు లీటరు నీటికి ప్లాసికోనజోల్ 1 మిల్లీలీటరు, లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మొక్కల మధ్య అంతర సేద్యం వలన తేమ త్వరగా ఆరిపోయి మొక్కలు కోలుకుంటాయన్నారు. వ్యవసాయ సహాయకులు సందీప్‌కుమార్, గోపీకృష్ణ, పవన్‌కుమార్, పాల్గొన్నారు.

పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: ప్రమాదవశాత్తు డాబా పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని రింగు రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఉమామహేశ్వరరావు (59) రింగు రోడ్డు సెంటరులో దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం వర్షం పడుతుండటంతో దుకాణంపై పట్టా కప్పేందుకు పిట్టగోడ ఎక్కి ప్రమాదవశాత్తూ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ఉమామహేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. గ్రామస్తులు అనుమాన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబసభ్యులు విలపిస్తున్నారు.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌పై సమగ్ర చర్చ జరగాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో ఎన్‌సీఈఆర్టీ ద్వారా రూపొందించిన సిలబస్‌పై సమగ్ర చర్చ జరపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి వనరులను ఉపయోగించుకుని, సుఖవంతమైన జీవనం పొందే పౌరులను తయారు చేయడం విద్య లక్ష్యం అని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రతి రాష్ట్రంలో ఎన్‌సీఈఆర్టీని స్థాపించారని చెప్పారు. దీని ద్వారానే స్థానిక చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, స్థానిక వనరులు, శీతోష్ణ స్థితి, వ్యవసాయం తదితర రంగాలపై విద్యార్థులకు ఒక సమగ్ర అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించేవారని తెలిపారు. గత ఐదేళ్లుగా ఎన్‌సీఈఆర్టీని మరుగున పరిచి అంతర్జాతీయ విద్యార్థిని తయారుచేయడం లక్ష్యంగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. ఎటువంటి చర్చ లేకుండా ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌పై ఒక సమగ్ర చర్చ జరపాలని కోరారు. ప్రచురణల విభాగం రాష్ట్ర చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి, ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంలు ప్రవేశపెట్టడంతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు జరగబోతున్నాయని, వీటిని జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు గోవిందు, కె.ప్రేమ్‌కుమార్, ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్ చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: ప్రముఖ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్ ఆడిట్‌లో తమ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించటం సంతోషకరమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య నాణ్యతలో విలువలు పాటిస్తున్నందుకుగానూ స్టాండర్స్ కలిగిన వసతులు సౌకర్యాలకుగానూ 21001:2018 ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ధ్రువీకరణ పత్రం అందజేశారన్నారు. చుట్టూ ఉండే ప్రాంతాన్ని పరిసరాలను పర్యావరణ పరిరక్షణ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నందుకు గానూ ఎన్విరాన్‌మెంట్ సిస్టం విభాగంలో 14001:2015 సర్టిఫికెట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ విభాగంలో ఖర్చులు తగ్గించటానికి, శక్తి వినియోగం, క్రియాశీల క్రమబద్ధమైన పద్ధతులు పాటిస్తున్నందుకు ఎనర్జీ మేనేజర్‌మెంట్ సిస్టమ్స్‌లో ఐఎస్‌ఓ 50001:2018 సర్టిఫికెట్ లభించిందన్నారు. ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌లు వచ్చేందుకు కృషిచేసిన అధ్యాపకులను, సిబ్బందిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

మేడికొండూరు: పేరేచర్లలో జరిగిన హత్యాయత్నం కేసులో ఎనిమిది మందిని శనివారం మేడికొండూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తుళ్లూరు డీఎస్పీ వి.అశోక్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. ఇటీవల జరిగిన పీర్ల పండుగ సందర్భంగా డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. వాటి ధర విషయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో షేక్ జాన్‌పీరాపై మారణాయుధాలతో హత్యాయత్నం చేశారు. కేసుకు సంబంధించి ఎనిమిది మంది నిందితులు షేక్ కరీ ముల్లా, షేక్ ఘన్ సైదా, షేక్ మద్రిపాలెం సుభాని, షేక్ మద్రిపాలెం గనిసాహెబ్, షేక్ మద్రిపాలెం కరీ ముల్లా, షేక్ మద్రిపాలెం షాబాజ్, షేక్ మద్రిపాలెం అబ్రహ్మద్, షేక్ మద్రిపాలెం ఆసీఫ్‌లను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ ఆదేశాల మేరకు తెల్ల క్వారీ సమీపంలో ఎస్సై వాసు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

సుభానిపై పీడీ యాక్ట్

పేరేచర్లలో జరిగిన హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ షేక్ మద్రిపాలెం సుభాని నిందితుడు కావడంతో అతని మీద పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. పీడీ యాక్ట్ ద్వారా ఆరు మాసాల వరకు బెయిల్ రాదని చెప్పారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రాకుంటే వారి ఆస్తులు జప్తు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్లు జాగ్రత్తలు పాటించి, వివాదాల జోలికి వెళ్లకుండా ప్రవర్తనలో మార్పులు తెచ్చుకుని జీవించాలన్నారు. సమావేశంలో మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్, ఎస్సై వాసు, కానిస్టేబుల్ శ్రీక్రాంత్ పాల్గొన్నారు.